ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 153 | మంగళవారం 3 మార్చి 2026 | పేజీలు -6 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

## మోడీ దుర్మార్గాలపై
# యుద్ధం

- బయటపడుతున్న మోడీ దుర్మార్గ చర్యలు..
- ఇరాన్ లాంటి దుస్థితి భారత్‌కు రాకూడదు..
- మోడీ తీరుతో ప్రమాదంలో దేశ పరిస్థితి..
- వికారాబాద్ కాంగ్రెస్ సమావేశంలో రాహుల్..

హైదరాబాద్ (తెలుగోడు),మార్చి 2 :



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దుర్మార్గాలన్నీ బయటపడుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, రాహుల్ గాంధీ తెలిపారు. మోదీ తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ సూచించారు. అందుకు కార్యకర్తలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. వికారాబాద్‌లో పీఏసీ సభ్యులతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాహుల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై సమావేశంలో (మిగతా 2లో)



# యుద్ధాన్ని ఆపండి మిత్రమా
# శాంతి దూతగా భారత్

- బెయిట్ షెమేష్‌పై క్షిపణి దాడి.. తొమ్మిది మంది మృతి..
- అమెరికా,ఇజ్రాయెల్ దాడులతో ఉద్రిక్తతలు తీవ్రం..
- ఖమేనీ మరణం వార్తతో ప్రతీకార అగ్నిజ్వాలలు..
- మోదీ,నెతన్యాహూ అత్యవసర ఫోన్ సంభాషణ..
- యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడితో చర్చలు..
- ఆసియా శాంతికి భారత్ కీలక పాత్ర..

న్యూఢిల్లీ (తెలుగోడు), మార్చి 2 :

పశ్చిమాసియా ఆకాశం క్షిపణులు విరజిమ్ముతున్న నిప్పులతో ఎర్రబడింది. ఇజ్రాయెల్ దేశంలోని బెయిట్ షెమేష్ నగరంపై ఇరాన్ జరిపిన ప్రతీకార దాడిలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా, మరో పదకొండు మంది ఆచూకీ తెలియకపోవడం ప్రపంచాన్ని కలవరపెడుతోంది. ఫిబ్రవరి ఇరవై ఎనిమిదో తేదీన అమెరికా ఇజ్రాయెల్ ఉమ్మడి దాడులతో ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ మరణించినట్టు వచ్చిన వార్త పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మార్చింది. మార్చి మొదటి తేదీ నాటికి ఈ ఉద్రిక్తతలు యుద్ధ జ్వాలలుగా మారాయి. ఈ క్లిష్ట సమయంలో ప్రపంచ దృష్టి భారత్ వైపు మళ్లింది. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేరుగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూతో ఫోన్‌లో మాట్లాడారు. పరిస్థితి తీవ్రతపై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోందని, పౌరుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, తక్షణమే ఘర్షణలు నిలిపివేయాలని సూచించారు. యుద్ధం ముదురుతున్న వేళ ఈ సంభాషణ రెండు దేశాల మధ్య ఉన్న బలమైన అనుబంధానికి నిదర్శనంగా నిలిచింది. మోదీ,నెతన్యాహూ మధ్య స్నేహం అంతర్జాతీయ వేదికలపై ప్రత్యేక గుర్తింపు పొందింది. గతంలో ఇజ్రాయెల్ పర్యటన సందర్భంగా సముద్ర తీరంలో ఇద్దరు నేతలు కలిసి నడిచిన దృశ్యాలు విశేషంగా చర్చనీయాంశమయ్యాయి. ఆ పర్యటనతో 2లో

## ప్రభుత్వ సేవలపై ప్రజలు
# సంతృప్తి చెందాలి

- ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి..
- ప్రభుత్వ సేవల్లో లోపం రాకుండా చూడాలి..
- బాణాసంచా ప్రమాదంపై శివకాశికి వెళ్లి స్టడీ..
- అధికారులకు సిఎం చంద్రబాబు సూచన..



అమరావతి (తెలుగోడు),మార్చి 2 :

ప్రభుత్వ సేవలపై ప్రజలు సంపూర్ణంగా సంతృప్తి చెందాల్సిందేనని, అధికారులు ఆ మేరకు కృషి చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని తేల్చిచెప్పారు. ఈ నెల నుంచి కనీసం 80 శాతం నుంచి 90 శాతం తగ్గకుండా పబ్లిక్ పర్సెప్షన్ ఉండాలని స్పష్టం చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి (మిగతా 2లో)

## ప్రవాసాంధ్రులను వెంటనే
# రప్పించాలి

- ప్రత్యేక ఏర్పాట్లకు రాష్ట్రం చొరవ చూపాలి..
- ప్రత్యేక నియంత్రణ గది, సహాయక చర్యలకు డిమాండ్..
- సంక్షోభ సమయంలో రాజకీయాలకు అతీతంగా సేవలు..



2లో

## టిటిడి ఛైర్మెన్‌పై భూమన
# ఘాటు విమర్శలు

- వీడియోలు, చిత్రాలు విడుదల..
- డీప్ ఫేక్ కాదని స్పష్టం చేసిన భూమన..
- రాజీనామా చేయాలంటూ డిమాండ్..
- విచారణ జరిపి నిజాలు నిగ్గుతేల్చాలి.. భూమన



2లో

## ఆంధ్రప్రదేశ్ పేరుమార్పుపై
# మళ్లీ రచ్చ

- కేరళం మార్పుతో రాష్ట్ర నామకరణంపై జోరుగా చర్చలు ..
- తెలుగునాడు పేరును తెరపైకి తెచ్చిన గరికపాటి..
- ఆంధ్ర పదానికి చారిత్రక గౌరవం ఉందని కమలానంద భారతి ప్రతిస్పందన..
- పేరుమార్పుతో ప్రయోజనం లేదని మరో వర్గం అభిప్రాయం..
- సామాజిక, సాంస్కృతిక వర్గాల్లో భిన్న స్వరాలు..




అమరావతి (తెలుగోడు), మార్చి 2 :

కేంద్ర ప్రభుత్వం కేరళ రాష్ట్రానికి స్థానికుల అభిలాష మేరకు కేరళం అనే రూపాన్ని ఆమోదించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పేరును కూడా మార్చాలనే వాదనలు మళ్లీ వినిపిస్తున్నాయి. గతంలో ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పడి అనంతరం ఆంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకున్న ఈ రాష్ట్రానికి తెలుగునాడు అనే పేరు పెట్టాలనే ఆలోచనలు అప్పట్లోనే వ్యక్తమయ్యాయి. ఇప్పుడు ఆ అంశం మళ్లీ ప్రజల ముందుకు వచ్చింది. ప్రఖ్యాత ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ఆంధ్రప్రదేశ్ అనే పేరులో సంపూర్ణ తెలుగుదనం ప్రతిబింబించడంలేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి తెలుగునాడు అనే పేరు పెడితే భాషా గౌరవం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. (మిగతా 2లో)

## విదేశాల్లో చిక్కుకున్న తెలుగు వారి భద్రతకు
# ప్రత్యేక చర్యలు

- తెలుగు వారికి ఏపీ అండ..
- కేంద్రంతో సమన్వయానికి సీఎం ఆదేశాలు..
- హెల్ప్ లైన్ నెంబర్లు విడుదల..
- సురక్షితంగా స్వదేశానికి తరలింపుపై దృష్టి..



అమరావతి (తెలుగోడు), మార్చి 2 :

పశ్చిమాసియాలోని ఇరాన్,ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో విదేశాల్లో చిక్కుకున్న తెలుగు ప్రజలకు అండగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దేశాల్లో పనిచేస్తున్నవారితో పాటు పర్యటనల కోసం వెళ్లిన పలువురు తెలుగు ప్రజలు అక్కడే నిలిచిపోయినట్లు సమాచారం అందడంతో ప్రభుత్వం అత్యవసరంగా స్పందించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విదేశాల్లో ఉన్న తెలుగు వారి వివరాలను సేకరించి, వారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. అవసరమైన సహాయ చర్యలను తక్షణం ప్రారంభించేందుకు ఎన్‌ఆర్‌టి, ఆర్టీజీఎస్ విభాగాలకు పూర్తి బాధ్యతలు అప్పగించారు. ప్రతి అభ్యర్థనను ప్రాధాన్యతగా తీసుకుని (మిగతా 2లో)

## ఉచిత వ్యవసాయ విద్యుత్
# కనెక్షన్లకు గ్రీన్ సిగ్నల్

- ఉచిత విద్యుత్ కోసం ఎదురుచూస్తున్న 46,113 మందికి ఊరట..
- రూ.250 కోట్లతో భారీ నిధుల విడుదల..
- ఈ నెలాఖరులోగా అనుమతులు జారీకి ఆదేశాలు..
- రెండు నెలల్లో కనెక్షన్ల పూర్తి లక్ష్యం..



అమరావతి (తెలుగోడు), మార్చి 2 :

రాష్ట్రంలోని రైతులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎప్పటి నుంచో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఊరట కలిగేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల సమస్యకు పరిష్కార మార్గం సుగమం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 46,113 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి మంజూరుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. వెంటనే అమలు చేపట్టేలా సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నెలాఖరులోగా అన్ని అనుమతులు పూర్తి చేయాలని కింది స్థాయి సిబ్బందిని ఆదేశించింది. ఈ పెండింగ్ కనెక్షన్ల ఏర్పాటు కోసం సుమారు రూ.250 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేయగా, ఆ మేరకు నిధుల విడుదల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ప్రస్తుతం రాష్ట్రంలో 22.3 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఉచిత విద్యుత్ అందుతోంది. ఇటీవల మంజూరు చేసిన 1.12 లక్షల కనెక్షన్లతో పాటు ఇప్పుడు క్లియర్ చేసిన 46,113 కనెక్షన్లకు కూడా ఉచిత విద్యుత్ అందించనున్నారు. ఈ కొత్త కనెక్షన్ల ఏర్పాటు కోసం 10 వేల ట్రాన్స్‌ఫార్మర్లను కేటాయిస్తున్నారు. అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు వేగంగా చర్యలు తీసుకోవాలని విద్యుత్ సంస్థలకు ప్రభుత్వం సూచించింది. రెండు నెలల్లోగా అన్ని కనెక్షన్లు (మిగతా 2లో)

## ఎద్దు దాడిలో ముగ్గురు మృతి
# జల్లికట్టులో రక్తపాతం




- శివగంగైలో విషాద ఘటన..
- యాభై మందికి పైగా గాయాలు..
- పలువురి పరిస్థితి విషమం.
- భద్రతా లోపాలపై ఆరోపణలు..
- పలు కుటుంబాల్లో విషాద ఛాయలు

చెన్నై (తెలుగోడు), మార్చి 2 :

శివగంగై జిల్లాలో నిర్వహించిన జల్లికట్టు పోటీలో విషాదం అలుముకుంది. సోమవారం జరిగిన ఈ సంప్రదాయ క్రీడ ఉత్సవంగా ప్రారంభమైనా, కొద్ది సేపటికే రక్తపాతం చోటుచేసుకుంది. ఎద్దులు అదుపు తప్పి పోటీదారులపై దాడి చేయడంతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో యాభై మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశముందని వైద్యులు తెలిపారు. జల్లికట్టు ప్రారంభానికి ముందు నుంచే భారీ సంఖ్యలో యువకులు పోటీ ప్రాంగణానికి తరలివచ్చారు. ఎద్దులను అదుపులోకి తీసుకోవడమే లక్ష్యంగా పోటీదారులు ఉత్సాహంగా మైదానంలోకి దూసుకెళ్లారు. అయితే ఒక్కసారిగా ఒక ఎద్దు ఉగ్రరూపం దాల్చి వరుసగా పలువురిని పొడిచింది. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలు భయంతో (మిగతా 2లో)

## ప్రాణాలతో కో పైలెట్ ఆట
# గాలిలో గాఢ నిద్ర

- తండ్రి మరణం వెనుక నిర్లక్ష్యమని కుమారుడి ఆగ్రహం..
- కాక్‌పిట్‌లో నిద్రలో సంస్థ యజమాని వీడియో కలకలం..
- వందల అడుగుల ఎత్తులో బాధ్యతాహీన ప్రవర్తనపైవిమర్శలు..
- సంస్థ విమానాలన్నీ నిలిపివేయాలని డిమాండ్...



న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 2 :

ఒకవైపు తండ్రిని కోల్పోయిన తీరని శోకం.. మరోవైపు ఆ మరణానికి కారణమైన వారి నిర్లక్ష్యం కళ్లముందే కనిపిస్తుంటే కలిగే ఆవేదన. మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు జయ్ పవార్ సామాజిక మాధ్యమ వేదికగా పంచుకున్న ఒక దృశ్యం ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. విమానం గాల్లో ఉండగానే, ప్రాణాలకు భరోసా ఇవ్వాల్సిన సంస్థ యజమాని సహ పైలట్ సీటులో గుర్రునిద్రలో ఉండటం చూసి ప్రజలు విస్తుపోతున్నారు. సోమవారం మధ్యాహ్నం వెలుగులోకి వచ్చిన ఈ దృశ్యంలో, సాధారణ దుస్తుల్లో ఉన్న ఒక వ్యక్తి హెలికాప్టర్ నడిపే గదిలో సహ పైలట్ సీటులో గాఢ నిద్రలో ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఆ వ్యక్తి వీఎస్ఆర్ వెంచర్స్ సంస్థ యజమాని రోహిత్ సింగ్ అని జయ్ పవార్ పేర్కొన్నారు. వందల అడుగుల ఎత్తులో ప్రయాణికుల ప్రాణాలు గాలిలో వేలాడుతుంటే బాధ్యతాయుతమైన సీటులో ఉండి నిద్రపోవడం క్షమించరాని నేరమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరి ఇరవై ఎనిమిదో తేదీన బారామతిలో జరిగిన భీకర విమాన ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదానికి కారణమైన లీర్‌జెట్ నలభై ఐదు ఎక్స్ ఆర్ విమానం కూడా అదే సంస్థకు చెందినదిగా సమాచారం. తన (మిగతా 2లో)



# ప్రవాసాంధ్రులను వెంటనే రప్పించాలి

## వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

**తాడేపల్లి (తెలుగోడు), మార్చి 2 :** అమెరికా,ఇజ్రాయిల్, ఇరాన్ దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రులను తక్షణమే సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వేలాదిమంది గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం పని చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. యుద్ధ పరిస్థితుల కారణంగా అక్కడ అనిశ్చితి నెలకొన్నదని, భద్రతా పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. పలు విమానాశ్రయాల్లో ఆంక్షలు విధించడం, విమాన సర్వీసులు రద్దు కావడం వల్ల చాలామంది ఎక్కడికక్కడే చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రవాసాంధ్రులందరినీ సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేసుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆంధ్రుల భద్రత, సురక్షిత ప్రయాణం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.సంక్షోభ సమయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి ప్రజల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని వైఎస్ జగన్ సూచించారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు వారి కుటుంబాలకు తెలియజేసే విధంగా ఇక్కడ ప్రత్యేక నియంత్రణ గది ఏర్పాటు చేయాలని, సహాయ సంఖ్యలను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# సాగునీటి భద్రతకు భరోసా

## వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు.. రైతులకు భారీ ఊరట.. సీఎం చంద్రబాబు, మంత్రి రవికుమార్‌కు కృతజ్ఞతలు.. మంత్రి అచ్చెన్నాయుడు..

**అమరావతి (తెలుగోడు), మార్చి 2 :** ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులకు గొప్ప ఊరట కలిగించిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రైతుల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. మొత్తం 46,113 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను దశలవారీగా మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో ఏపీసీపీడీసీఎల్ పరిధిలో 6,593, ఎస్పీడీసీఎల్ పరిధిలో 11,926, ఈపిడీసీఎల్ పరిధిలో 27,594 కనెక్షన్లు ఉన్నాయని వెల్లడించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు తన విజ్ఞప్తికి వెంటనే స్పందించి సానుకూల నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కనెక్షన్ల మంజూరుతో రైతులకు సాగునీటి భద్రత లభించి, పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. గతంలో అనేక కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఇప్పుడు ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చి పరిష్కరించడం రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని



పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల సంక్షేమం కోసం అవసరమైన మౌలిక వసతులు, విద్యుత్ సరఫరా, సాగునీటి వనరులను మెరుగుపరచడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల అభ్యున్నతి కోసం తీసుకునే ప్రతి నిర్ణయం వారి భవిష్యత్తుకు భరోసా కలిగించే విధంగా ఉంటుందని, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం ముందుకు సాగుతుందని ఆయన అన్నారు.

# మెళవాయిలో తాగునీటి సమస్య పరిష్కారం

**రొళ్ల (తెలుగోడు), మార్చి 2:** మడకశిర మండలం మెళవాయిలో తాగునిటీ సమస్య ఎక్కువ ఉండడంతో కొత్త బోర్ బావిని తవ్వించి కొత్త మోటారు పంపు సెట్ బిగించి, కొత్తగా పైపు లైన్ ను అమర్చి దీర్ఘాకాళిక తాగునిటీ సమస్య ను శాసన సభ్యులు, ఎం ఎస్ రాజు, మాజీ శాసన మండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి పరిస్కారించడంతో ఆంధ్రప్రదేశ్ కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మి నారాయణ మాజీ సర్పంచ్ నారాయణ గౌడ్, సర్పంచ్ రంగనాధ్, బీజేపీ నాయకులు రాందాస్ రావు తెలుగు దేశం పార్టీ నాయకులు, ప్రజలు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ కి కృతజ్ఞతలు తెలిపిన హర్షం వ్యక్తం చేశారు.



బోర్ బావి నుంచి నీటిని

# ఆసుపత్రిలో చేరిన టిడిపి నేతలకు పరామర్శ

## ఆసుపతిలో చేరిన టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు హనుమంతరాయ చౌదరి , మాజీ జెడ్పీటీసీ చెన్నకేశవులు.. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ..

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 2 :** అనంతపురం నగరంలోని సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ సీనియర్ నాయకులు మాజీ అధ్యక్షులు హనుమంతరాయ చౌదరినీ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు. అనారోగ్యానికి గురై అనంతపురం సవేరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి ఉమ్మడి అనంతపురం జిల్లా మాజీ అధ్యక్షులు కళ్యాణ దుర్గం మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరినీ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై కుమారుడు మారుతీనాయుడు తోను ,అక్కడ ఉన్న వైద్యులతో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని మళ్ళీ ఆరోగ్య జీవితం గడపాలని ఆయన ఆకాంక్షించారు.అదే విధంగా అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పుట్టపర్తి మాజీ జెడ్పిటిసి చెన్నకేశవులును మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అక్కడ ఉన్న వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ఆరోగ్య జీవితం పొందాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆకాంక్షించారు. చెన్నకేశవులు ఆరోగ్య పరిస్థితిని అక్కడే ఉన్న కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వైద్యులకు



ఆసుపత్రిలో చేరిన టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు హనుమంతరాయ చౌదరిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

ప్రత్యేకంగా సూచించారు. రాయలసీమ ఆస్పత్రిలో బుక్కపట్నం మండలం లింగప్ప గారి పల్లి చెందిన వినోద్ కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ ఎక్కించ పొందుతున్న అతన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అతనికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. త్వరగా కోలుకొని ఆరోగ్య జీవితం గడపాలని కోరారు. మాజీ మంత్రితోపాటు నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో చేరిన మాజీ జెడ్పీటీసీ చెన్నకేశవులును పరామర్శిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



# మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ప్రారంభం

**విజయవాడ (తెలుగోడు), మార్చి 2 :** ఎంపీ కేశినేని శివనాథ్ సారథ్యంలో కేశినేని ఫౌండేషన్ మరియు ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో మష్రూమ్స్ పెంపకం, హోమ్ బేస్డ్ ప్రొడక్ట్స్ ఉత్పత్తుల తయారీ విధానం పై ఐదు రోజుల పాటు శిక్షణ పొందేందుకు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డికి వెళ్లిన 45 మంది ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎస్.హెచ్.జి మహిళలకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభం అయ్యాయి. 12వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కు వెళ్లిన వీరికి మార్చి 2 నుంచి మార్చి 6వ తేదీ వరకు ఐదు రోజులు పాటు మష్రూమ్స్ పెంపకం, హోమ్ బేస్డ్ ప్రొడక్ట్స్ ఉత్పత్తుల తయారీ విధానం పై శిక్షణ వుంటుంది. ఈమేరకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది

ఈ ఐదు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం ప్రారంభ సమావేశం ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్. లో సోమవారం అసోసియేట్ ప్రోపెసర్ (సి.ఐ.ఎ.టి.ఎస్.జె -హెడ్) డాక్టర్ సి.కత్తిరేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమేష్ శక్తివేల్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మహ్మద్ ఖాన్,

హోమ్ బేస్డ్ ప్రొగ్రామ్స్ ట్రైనర్ మానస, మష్రూమ్స్ పెంపకం ట్రైనర్ ప్రసన్న శిక్షణ తీసుకునే మహిళలకు ఉత్పత్తుల తయారీ విధానం, శిక్షణ తరగతుల కార్యక్రమాల గురించి, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీ రాజ్ గురించి వివరించారు.

హోమ్ బేస్డ్ ప్రొడక్ట్స్ (వాషింగ్ ఫౌడర్, లిక్విడ్ సోప్స్, షాంపులు, పినాయల్) తయారీ లో శిక్షణ పొందే వారికి ట్రైనర్ మానస హోమ్ బేస్డ్ ప్రొడక్ట్స్ తయారీకు కావాల్సిన ముడి పదార్థాలు వాటి లక్షణాలు, తయారీ ప్రక్రియ, ఉపయోగాలు సవివరంగా తెలియజేయటం జరిగింది. అలాగే మష్రూమ్స్ పెంపకం ట్రైనర్ ప్రసన్న మష్రూమ్స్ పెంపకానికి సంబంధించి అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. . స్వయం ప్రతిపాదికన వృద్ధి సాధించేందుకు శిక్షణ కార్యక్రమంకు పంపించినందుకు ఎంపీ కేశినేని శివనాథ్ తో పాటు కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డికి శిక్షణ పొందుతున్న మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి అర్బన్ కో-ఆర్డినేటర్ సొంగా సంజయ్ వర్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మోడీ దుర్మార్గాలపై యుద్ధం

(మొదటి పేజి తరువాయి)

రాహుల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇరాన్ లాంటి పరిస్థితులు దేశానికి రాకుండా ఉండాలన్నారు. మోదీ ప్రభుత్వ చర్యల వల్ల ఇండియాలో యుద్ధం వచ్చే పరిస్థితులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండో-అమెరికన్ ట్రేడ్ డీల్‌తో ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పార్టీ.. ప్రభుత్వం కలిసి మంచిగా పనిచేస్తున్నాయని రాహుల్ పేర్కొన్నారు. సామాజిక అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టాలని పార్టీ సీనియర్ నేత వీహెచ్ కోరగా.. అందుకు రాహుల్ సమ్మతి తెలిపారు. సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాల పీఏసీ సభ్యులు పాల్గొన్నారు. రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్, మహేష్ గౌడ్, వైఎస్ షర్మిల తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్.. ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి అనంతగిరి హరితా రిసార్ట్స్‌కు బయలుదేరారు. అక్కడ జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొనన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ, ఏపీ పీసీసీ చీఫ్‌లు మహేశ్‌కుమార్ గౌడ్, షర్మిలతో పాటు ముఖ్యనేతలు హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై నేతలతో రాహుల్ చర్చించారు. గత 9 రోజులుగా ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల శిక్షణ శిబిరం అక్కడ కొనసాగుతోంది. అంతుకుముందు ఉదయం ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాహుల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురూ వికారాబాద్ జిల్లాకు బయలుదేరారు. వికారాబాద్ ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రాంగణంలో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశానికి రాహుల్ గాంధీ హాజరు అయ్యారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రస్తుత రాజకీయ అంశాలు, పార్టీ బలోపేతం తదితర కీలక విషయాలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులను ఖరారు చేసే అవకాశం ఉంది. రాజ్యసభ రేసులో అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి, చిన్నారెడ్డి, వీహెచ్, దొమ్మటి సాంబయ్య, బెల్లయ్య నాయక్, హజ్మతుల్లా హుస్సేన్ ఉన్నారు. వికారాబాద్ చేరుకున్న కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మంత్రి వివేక్ వెంకటస్వామి స్వాగతం పలికారు. హెలిప్యాడ్ దగ్గర బొకేతో స్వాగతం పలికిన మంత్రి వివేక్ రాహుల్ గాంధీని శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో సంపత్ కుమార్, షబ్బీర్ అలీ, సునీతారావులు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. సమావేశంలో సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై రాహుల్ గాంధీ చర్చించినట్లు సమాచారం. రాహుల్ గాంధీతో పాటు కేసి వేణుగోపాల్ సమావేశంలో పాల్గొన్నారు.

# టిటిడి చైర్మెన్‌పై భూమన ఘాటు విమర్శలు

**తిరుపతి (తెలుగోడు), మార్చి 2 :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, 'నువ్వు నా కాలి గోటికి కూడా సరిపోవు. నీలాంటి వాడిని మనిషిలా కూడా చూడను' అని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఓ మహిళతో పలు ప్రాంతాల్లో సన్నిహితంగా ఉన్నట్లు కనిపిస్తున్న వీడియోలు, చిత్రాలను ఆయన మీడియా ఎదుట విడుదల చేశారు. తనపై అసత్య ప్రచారం జరుగుతోందని, అవి కృత్రిమంగా సృష్టించిన దృశ్యాలేనని బీఆర్ నాయుడు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అవి కృత్రిమంగా తయారు చేసినవి కాదని, వాస్తవ నిర్ధారణ చేసిన తరువాతనే తాము ఈ అంశంపై మాట్లాడుతున్నామని స్పష్టం చేశారు. టీటీడీ చైర్మన్ పదవికి బీఆర్ నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 2019లో వీడియోలో కనిపించిన మహిళ అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ లేఖలో బీఆర్ నాయుడు మహిళా వ్యసనపరుడని పేర్కొన్నారని తెలిపారు.

ఆ లేఖలో రాసిన ప్రతి అంశానికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. ఆ సమయంలో బీఆర్ నాయుడు కంటతడి పెట్టుకోవడంతో తాను నమ్మినట్టు చెప్పారు. అయితే ఇప్పుడు వెలుగులోకి వచ్చిన వీడియోలు పరిస్థితిని పూర్తిగా మార్చేశాయని వ్యాఖ్యానించారు. సమగ్ర విచారణ జరిపిస్తే అసలు నిజాలు బయటపడతాయని పేర్కొన్నారు. టీటీడీ చైర్మన్ పదవికి తక్షణమే రాజీనామా చేయాలని, లేకపోతే మరిన్ని వాస్తవాలు ప్రజల ముందుకు తెస్తామని భూమన కరుణాకర్ రెడ్డి హెచ్చరించారు. ఈ వ్యవహారం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# శాంతి దూతగా భారత్

(మొదటి పేజి తరువాయి)

ప్రారంభమైన సాంకేతిక, రక్షణ రంగాల సహకారం కాలక్రమేణా మరింత బలపడింది. ప్రస్తుతం యుద్ధ వాతావరణంలోనూ ఆ బంధం స్పష్టంగా కనిపిస్తోంది.కేవలం ఇజ్రాయెల్‌తోనే కాదు, అరబ్ దేశాలతోనూ భారత్ సమతూక దౌత్యాన్ని కొనసాగిస్తోంది. అదే రోజు ప్రధాని మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో కూడా ఫోన్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ, కష్టకాలంలో భారత్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఇటు ఇజ్రాయెల్, అటు అరబ్ దేశాల మధ్య సమన్వయం పాటిస్తూ ఢిల్లీ నడిపిస్తున్న దౌత్య వ్యూహం ఆసియా రాజకీయాల్లో కీలకంగా మారుతోంది. పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య శాంతి, స్థిరత్వం కోసం భారత్ చేస్తున్న కృషి అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షిస్తోంది. పశ్చిమాసియా యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, శాంతి సందేశంతో ముందుకు సాగుతున్న భారత్ భవిష్యత్తు పరిణామాల్లో ప్రధాన పాత్ర పోషించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి

# సంతృప్తి చెందాలి

(మొదటి పేజి తరువాయి)

చంద్రబాబు నాయుడు తన పాలనలో 'పబ్లిక్ పర్సెప్షన్' కు అధిక ప్రాధాన్యతని స్తున్నారు. సోమవారం ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్షెప్షన్‌పై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ..'పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు తలెత్తుతున్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా.. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలి. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై అధికారులు శివకాశీకి

వెళ్లి అధ్యయనం చేసిరావాలన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది పనితీరు బాగుంది. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలి. వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి, నూటికి నూరు శాతం వాట్సప్ సేవల వినియోగం జరగాలి. అన్ని శాఖల పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని అన్నారు.

# ఆంధ్రప్రదేశ్ పేరు మార్పుపై మళ్లీ రచ్చ

(మొదటి పేజి తరువాయి)

గతంలో నందమూరి తారక రామారావు కూడా ఇదే దిశగా ఆలోచించారని గుర్తుచేశారు. కేరళ ప్రజలు తమ రాష్ట్రానికి స్వభాషా రూపాన్ని సాధించుకున్నట్లే మన రాష్ట్రానికీ తగిన పేరు రావాలని ఆయన సూచించారు.ఈ వ్యాఖ్యలపై భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆంధ్ర అనే పదం ప్రాచీన సాహిత్యంలో నుంచే వినిపిస్తోందని, ఆంధ్రప్రదేశ్ అనే పేరులో తెలుగుదనం లేదనడం సరైంది కాదని స్పష్టం చేశారు. పేరుమార్చినంత మాత్రాన ప్రజల భావోద్వేగాలు మారవని, చారిత్రక మూలాలను విస్మరించడం మంచిది కాదని తెలిపారు.ప్రాంతీయ భావాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం సమంజసం కాదని, రాష్ట్ర ప్రజల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలన్నారు. తెలుగునాడు అనే పేరు పెట్టినా ప్రత్యేక భావోద్వేగం కలుగదని, ఇలాంటి ఆలోచనలు అవసరంలేని చర్చలకు దారితీస్తాయని విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తు గురించి నిర్ణయాలు తీసుకునే ముందు సమగ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని సూచించారు.

రాష్ట్ర పేరుమార్పు అంశం ప్రస్తుతం రాజకీయ, సాంస్కృతిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు భాషా గౌరవం పేరుతో మార్పు అవసరమని కొందరు వాదిస్తుండగా, మరోవైపు చారిత్రక వారసత్వాన్ని కాపాడాలని మరికొందరు స్పష్టం చేస్తున్నారు. ఈ వివాదం ఇకపై మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# తెలుగువారి భద్రతకు ప్రత్యేక చర్యలు

(మొదటి పేజి తరువాయి)

స్పందించాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, అవసరమైతే అత్యవసర తరలింపు చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలతో నేరుగా సంప్రదింపులు జరిపి, వారికి ధైర్యం చెప్పాలని అధికారులకు సూచించారు.మరోవైపు ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ వేలాది మంది భారతీయులు ఆ ప్రాంతాల్లో చిక్కుకుపోయారు. వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి భారత విదేశాంగ శాఖ తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. సంబంధిత దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి.తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రత్యేక నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేసి సహాయక చర్యలు ప్రారంభించాయి. సహాయం కావాలనుకునే వారు హెల్ప్ లైన్ నెంబర్లు, వాట్సప్, ఈ మెయిల్ ద్వారా తమ వివరాలను తెలియజేయాలని సూచించాయి. అందిన సమాచారాన్ని కేంద్రానికి చేరవేసి సమన్వయం చేయడం జరుగుతోందని అధికారులు వెల్లడించారు.ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, విదేశాల్లో ఉన్న ప్రతి తెలుగు వ్యక్తి భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అవసరమైతే ప్రత్యేక విమానాల ద్వారా స్వదేశానికి తరలించే చర్యలు కూడా చేపడతామని తెలిపారు. విదేశాల్లో ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలని, అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని ప్రభుత్వం సూచించింది.

# ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజి తరువాయి)

అందించేలా లక్ష్యాన్ని నిర్ణయించింది.వేసవి కాలానికి ముందే ఈ ప్రక్రియ పూర్తయితే, వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతులకు సాగునీటి లభ్యత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ రంగానికి ఇది మరింత బలాన్నిస్తుందని భావిస్తున్నారు.

# గాలిలో గాఢ నిద్ర

(మొదటి పేజి తరువాయి)

తండ్రి మరణానికి ఆ సంస్థ అడ్డగోలు నిర్లక్ష్యమే కారణమని జయ్ పవార్ ఆరోపిస్తున్నారు. తక్కువ దర్శన పరిమితి ఉన్న సమయంలో విమానాన్ని దిగేందుకు ప్రయత్నించడమే ఆ ఘోరానికి దారి తీసిందని పేర్కొన్నారు.

విమాన ప్రమాదాల పరిశోధన విభాగం ప్రాథమిక నివేదిక ప్రకారం ప్రమాదం జరిగిన రోజున దర్శన పరిమితి కేవలం మూడు కిలోమీటర్లు మాత్రమే ఉంది. నిబంధనల ప్రకారం కనీసం ఐదు కిలోమీటర్ల దర్శన పరిమితి ఉండాల్సి ఉంది. ఆ ప్రమాణాలను విస్మరించడం వల్లే విమానం కూలిపోయి పైలట్లతో పాటు అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోయారని వెల్లడైంది.కేవలం దృశ్యం పంచుకోవడమే కాకుండా పౌర విమానయాన ప్రధాన నియంత్రణాధికారికి జయ్ పవార్ బహిరంగ విజ్ఞప్తి చేశారు. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత సంస్థకు చెందిన విమానాలన్నింటినీ తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల భద్రతను పణంగా పెట్టిన యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విమానయాన రంగంలో భద్రతా ప్రమాణాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ ఘటనతో దేశవ్యాప్తంగా విమాన భద్రతపై మరోసారి తీవ్ర చర్చ ప్రారంభమైంది.

# జల్లికట్టులో రక్తపాతం

(మొదటి పేజి తరువాయి)

రుగులు తీశారు. కొంతసేపు పోటీ నిలిపివేయాల్సి వచ్చింది.గాయపడిన వారిని స్థానికులు, పోలీసులు కలిసి సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. వైద్య సిబ్బంది అత్యవసర చికిత్స అందిస్తున్నారు. పదిహేను మందికి పైగా తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. రక్తస్రావం ఎక్కువగా జరిగిన కారణంగా కొందరిని ప్రత్యేక వైద్య విభాగాలకు తరలించినట్లు సమాచారం.ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తగిన భద్రతా ఏర్పాట్లు లేకుండానే పోటీ నిర్వహించారని ఆరోపిస్తున్నారు. ప్రేక్షకులను నియంత్రించే ఏర్పాట్లు సరైన విధంగా లేకపోవడం, ఎద్దులను విడిచే సమయంలో నియమాలు పాటించకపోవడమే ప్రమాదానికి కారణమని అంటున్నారు. బాధిత కుటుంబాలు నిర్వాహకుల నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.మరణించిన యువకుల మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరవుతున్నారు. గ్రామంలో విషాద ఛాయలు కమ్ముకున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తక్షణ సహాయం ప్రకటించాలని ప్రజలు కోరుతున్నారు.

తమిళనాడులో జల్లికట్టు అనేది శతాబ్దాలనాటి సంప్రదాయ క్రీడ. ప్రతి సంవత్సరం పొంగల్ పండుగ సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ పోటీలు నిర్వహిస్తారు. ఎద్దులను అదుపులోకి తెచ్చే క్రీడగా ఇది ప్రత్యేక గుర్తింపు పొందింది. అయితే భద్రతా చర్యలు కచ్చితంగా అమలు చేయకపోతే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గత అనుభవాలు చెబుతున్నాయి.ఇటీవలి సంవత్సరాల్లో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ ప్రజల ఉత్సాహం తగ్గలేదు. ఈసారి జరిగిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సామాజిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.



ఇన్నర్ ఇంజనీరింగ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

# ధ్యానంతో ఒత్తిడిని జయించవచ్చు

**పోస్టర్లు ఆవిష్కరణ.. సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ ..**

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 2 :**

ధ్యానంతోనే ఒత్తిడిని జయించవచ్చని సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ అన్నారు. ఇన్నర్ ఇంజనీరింగ్ పోస్టర్‌ను జెడి లక్ష్మీనారాయణ , ఆకుల రాఘవేంద్ర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒత్తిడిని జయించాలంటే ధ్యానంతోనే సాధ్యమన్నారు. ఈషా ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఇన్నర్ ఇంజనీరింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరంలో మార్చి 4 న నుంచి ఈశా ఫౌండేషన్ ఇన్నర్ ఇంజనీరింగ్ క్లాసులు ఉంటాయని ఇషా వలంటీర్ రవితేజ తెలిపారు. డ్రిమిట్ డూ ఇట్, గుత్తి రోడ్డులో ఉదయం 6 గంటల నుంచి 7 వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 7 వరకు ధ్యానయోగ సాధన నేర్పిస్తారు. ఇన్నర్ ఇంజనీరింగ్‌లో సులభమైన యోగ సాధనలు, సెషన్లు, సద్గురు సూచనలతో రూపొందించిన ప్రక్రియలు ఉంటాయన్నారు. శక్తివంతమైన 21 నిమిషాల శాంభవి మహాముద్ర అనే క్రియ యోగ సాధన ఉంటుందన్నారు. దీనివలన వత్తిడి,భయం ,అలర్జీ, బీపీ , ఆందోళన ఉపశమనం పొందవచ్చునన్నారు. వివరాలకు 7981757532/ 7795228317 ఫోన్ చేయొచ్చన్నారు.

# శ్రీశైలంలో పౌర్ణమి ప్రత్యేక పూజలు

**శ్రీశైలం (తెలుగోడు), మార్చి 2 :**

శ్రీశైల మహా క్షేత్రంలో పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు అర్చక స్వాములు సాంప్రదాయపద్ధంగా నిర్వహించారు ఊయలసేవ: సోమవారం సాయంత్రానికి పౌర్ణమి ఘడియలు రావడంతో శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించారు. పతి శుక్రవారం , పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఊయలసేవ జరిపిస్తారు. లక్షకుంకుమార్చన తరువాత ఊయలసేవ నిర్వహించారు. భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించారు. చివరగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలసేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చన విశేషంగా జరిపించబడింది పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించారు. ఈ లక్షకుంకుమార్చనలో భక్తులు పరోక్షసేవగా పాల్గొనే అవకాశం కల్పించారు. ఈ లక్షకుంకుమార్చన జరిపించుకోవడం వలన కష్టాలు తొలగిపోతాయని, సర్వశుభాలు కలుగుతాయని, అభీష్టాలు సిద్ధిస్తాయని, సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని, సంసారం వృద్ధిలోకి వస్తుందని, సంతాన సౌఖ్యం కలుగుతుందని, పూర్వజన్మదోషాలు తొలగిపోతాయని చెప్పబడుతోంది. శ్రీశైలక్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో ఆయా ఆర్జితసేవలను పరోక్షంగా జరిపించుకునేందుకువీలుగా దేవస్థానం ఈ ఆర్జితపరోక్షసేవను నిర్వహిస్తోంది. ఈ పరోక్షసేవకు భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ.1,116 సేవారుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. భక్తులు సేవారుసుం www.srisailadevasthanam.org , aptemples.ap.gov.in ద్వారా చెల్లింపు చేయవచ్చని కార్య నిర్వహణ అధికారి ఎం శ్రీనివాసరావు తెలిపారు.

# కూటమి ఎన్నికల మాట నిలబెట్టుకుంటుందా?

*గుండ్రేవుల,సిద్దేశ్వరం- అలుగు ప్రాజెక్టులు పూర్తి అవుతాయా..*

తుంగభద్ర,శ్రీశైలం ప్రాజెక్టులు పూడిక వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి హక్కుగా రావలసిన 130 టీఎంసీల నీటిని కోల్పోతున్న సందర్భంగా ఆ నీటిని నిలబెట్టు కోవడానికి పైన కర్ణాటక రాష్ట్రం తుంగభద్ర మీద అప్పర్ భద్ర, కృష్ణానదిపై ఆలమట్టి ఎత్తు పెంపు కార్యక్రమాలకు పూనుకుంటే తెలుగు ప్రభుత్వాలు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయి. పూడిక వల్ల నష్టపోతున్న నీటిని నిలబెట్టుకోవడానికి ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనకరమైన గుండ్రేవుల,సిద్దేశ్వరం- అలుగు ప్రాజెక్టులు పూర్తి చేయాలన్న ప్రజల కోరిక మేరకు ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, యువగలం పాదయాత్రలో లోకేష్ బాబు గారు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.



అసెంబ్లీలో జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు గుండ్రేవుల ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారే కానీ బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం అనుమానాస్పదం. ఈ ప్రాజెక్టు 20 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించడం వల్ల కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతాలకు,కేసీ కెనాల్ కు సాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణ,కర్ణాటక రాష్ట్రాల అనుమతి తీసుకోవడం పై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలి,ఈ ప్రాజెక్టు వల్ల ఆ రాష్ట్రాలకు కూడా ప్రయోజన కరమే, కావున అభ్యంతరం చెప్పడానికి వీలు లేదు. 2020 నాటికే గుండ్రేవుల ప్రాజెక్టు అంచనా 4530 కోట్లు.ఖర్చు తక్కువ, ప్రయోజనం ఎక్కువ.

ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధుల మార్పులే కాని ప్రాజెక్టుల రూపురేఖలు మారడం లేదు.అవే ప్రశ్నలు అవే సమాధానాలు. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మిస్తాం అనే మాట గత ఎనిమిదేళ్లుగా చెబుతూనే ఉన్నారు,కానీ నిర్మాణం మాత్రం మొదలు కాలేదు. 2012లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారికి విశ్రాంత సాగునీటి ఇంజనీర్ ఎం సుబ్బరాయుడు గారు ఇచ్చిన ప్రతిపాదనలను తీసుకెళ్లి,డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డిపిఆర్) తయారు చేయడానికి అనుమతులు సాధించింది,పునాది వేయడం జరిగింది.

గుండ్రేవుల రిజర్వాయర్ కేవలం ఆంధ్రప్రదేశ్ కే కాదు, తెలంగాణలోని రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ ప్రాజెక్టుకు, కర్ణాటకలో తుంగభద్ర పరివాహక ప్రాంత ప్రజలకు త్రాగునీరు,అక్కడి మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించే సామర్థ్యం ఉన్న సమగ్ర ప్రయోజన ప్రాజెక్టు. ఉమ్మడి రాష్ట్రంలోనే అనుమతులు లభించినప్పటికీ రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలైనా రిజర్వాయర్ నిర్మాణం చేపట్టలేదు. 2018లో కర్నూలు నుండి గుండ్రేవుల వరకు జరిగిన ప్రజా పాదయాత్ర సందర్భంగా అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు గారు గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి పక్క రాష్ట్రాలతో చర్చలు చేపడతామని ప్రకటించారు.2024 ఎన్నికల సందర్భంగా కూడా మాట ఇచ్చాడు.ప్రస్తుతం ఆయనే ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన ఎక్కడికి వెళ్ళినా ప్రతి ప్రాజెక్టు నేనే ప్రారంభించా, నేనే పూర్తి చేస్తా,అనే మాటలు చెబుతున్న సందర్భంగా అన్ని ప్రాంతాల ప్రయోజనాలు కలిగిన ఈ ప్రాజెక్టు కూడా అతనే పూర్తి చేస్తారా?

మాట ఇచ్చి ఎనిమిదేళ్లు గడిచినా అతీగతీ లేదు. పక్క రాష్ట్రాలతో చర్చలు చేస్తాం,నిర్మాణం ప్రారంభిస్తాం అనే మాటలు కోటలు దాటుతున్నాయే కానీ పని మాత్రం గడప దాటడం లేదు. ప్రస్తుతం తెలంగాణ, నవ్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి సిద్దేశ్వరం దగ్గర శ్రీశైలం ప్రాజెక్టు పైన ఏర్పాటు చేస్తున్న తీగల వంతెనకు బదులు బ్రిడ్జి కం రోడ్డు (అలుగు) ఏర్పాటు చేయడం వల్ల ఎటువంటి భూసేకరణ లేకుండా 50 టీఎంసీల నీటిని నిలబెట్టి,అత్యంత కరువు పీడిత ప్రాంతమైన రాయలసీమకు మళ్లించవచ్చు.దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి ఒప్పించాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలంతా అన్నదమ్ములే, అందరికీ ఉపయోగపడే పనులను చేపడతాం అని ప్రకటించిన ఇరువురు ముఖ్య మంత్రులు,చంద్రబాబు, రేవంత్ రెడ్డి,ఇక నైనా మన ఉభయ తెలుగు రాష్ట్రాలకు,పొరుగు రాష్ట్రం కర్ణాటక కు ఉపయోగపడే ఈ ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా చర్యలు చేపడతే మంచిది,లేకుంటే అవే ప్రశ్నలు,అవే సమాధానాలు. ఇంకో ఎనిమిదేళ్ల గడచినా పునరావృతమవుతూనే ఉంటాయి.అందుకే ఒట్టి మాటలు కట్టిపెట్టి గట్టి మేలు తల పెట్టండి.

కేవలం ప్రకటనలు, జలహారతులతో జల సంరక్షణ జరగదు.ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలి.శ్రీశైలం రిజర్వాయర్ నుండి విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటిని తరలించడాన్ని తక్షణమే ఆపేయాలి. ఈ సంవత్సరం రెండు వేల టీఎంసీలు పైగా కృష్ణా నది గుండా శ్రీశైలం రిజర్వాయర్ కు చేరినా రాయలసీమకు జీవనాడి అని చెప్పుకుంటున్న ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి కెసికెనాలకు ఇచ్చింది కేవలం 1.2 టీఎంసీలు మాత్రమే.

రైతుల పంటలు ఎండిపోతున్నాయని అడిగితే తప్ప నీళ్లు విడుదల చేయని పరిస్థితి ఒకవైపు.నీటిని విడుదల చేసి పంటలు కాపాడుతున్నామని గొప్పలు చెప్పుకోవడం మరోవైపు. మాటలలో మాత్రమే జల సంరక్షణ.అదే నిజమైతే ఒకవైపు విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం రిజర్వాయర్ ను ఖాళీ చేస్తూ మరోవైపు ఫిబ్రవరి 26న అసెంబ్లీలో ముఖ్యమంత్రి,జల సంరక్షణ చేసి వచ్చే ఖరీఫ్ పంటలకు కూడా ( మే 15కు) నీళ్లు ఇస్తాం,అని ప్రకటించడం సాధ్యమేనా. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల ముందే అసెంబ్లీలో ఇలాంటి విరుద్ధ,అవాస్తవ ప్రకటనలు వినడం బాధాకరం.అందుకే చట్టసభలపై ప్రజలకు ఆశలు సన్నగిల్లుతున్నాయి.

*– కేవీ రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు,*
*వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక, అనంతపురం.*

# గజేంద్ర వాహనంపై చెన్నకేశవ స్వామి దర్శనం

**యాడికి (తెలుగోడు), మార్చి 2 :**

యాడికి మండల కేంద్రంలో వెలసిన శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం గజేంద్ర వాహనంపై శ్రీ శివ లక్ష్మి చెన్నకేశవ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ఆలయంలో అర్చకులు భక్తులు ఆధ్వర్యంలో నిత్య పూజలు ప్రత్యేక పూజలు కార్యక్రమం నిర్వహించారు. ప్రాభాతిక మంగళ వాయిద్య, గీతా మంగళహారతులు గంగాహరణం (బిందెసేవ) ఆగమనిహిత కార్యక్రమం గ్రామం నందు బలిహరణాలు భగవంతుని తిరుమజ్జ నాధులు ఆరాధన, సహస్రనామ పూజ, ఉత్సవ మూర్తులను పల్లకి యందు ఉంచి గ్రామమున ఊరేగింపు.



గజేంద్ర వాహనంపై
శ్రీ శివలక్ష్మి చెన్నకేశవ స్వామి ఊరేగింపు



ప్రత్యేక అలంకారంలో శ్రీ శివలక్ష్మి చెన్నకేశవ స్వామి

విశ్వరూప సందర్శన, మంగళహారతి, మంత్రపుష్పాల సమర్పణ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదములు పంపిణీ చేశారు. ధ్వజారోహణ కార్యక్రమం అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేక అర్చనలు నిర్వహించారు.

రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గజేంద్ర వాహనంలో ఉంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం స్వామివారి ఆలయం వద్ద నుండి చిన్న రథంపై కెనరా బ్యాంక్, పాత పోలీస్ స్టేషన్ సర్కిల్. లాలాల వీధి. వైశ్య విధి. కోట వీధి.పెద్దమ్మతల్లి ఆలయం మీదుగా స్వామి వారి ఆలయానికి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.





చెన్నకేశవ స్వామి ఊరేగింపు. బ్రహ్మోత్సవాల్లో భక్తుల సందడి

# వచ్చింది నలుగురే..

**ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 20 శాఖలకు గానూ హాజరైన నలుగురు అధికారులు..**

**యాడికి (తెలుగోడు), మార్చి 2 :**

క్షేత్రస్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదికలోనే సమస్యలు పరిష్కరిస్తే జిల్లా స్థాయిలో వందల సంఖ్యలో ప్రజల నుండి ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండడంతో జిల్లా స్థాయి అధికారుల మండల సాయి కార్యాలయాల్లో ఏర్పాటు చేయడంతో ప్రజా సమస్య పరిష్కారం తగ్గుముఖం పడతాయని ఆలోచనతో నిర్వహించగా అయితే అది క్షేత్రస్థాయిలో అపహాస్యమవుతోంది అనడానికి ఈ కథనం నిదర్శనం. సోమవారం యాడికి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీ ఆర్ఎస్ పట్టుమని పదిమంది కూడా లేకపోవడం అధికారుల చిత్తశుద్ధిని వెక్కిరిస్తోంది. రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయ, విద్యుత్తు, వైద్యం, విద్య, పశువైద్యం, గృహనిర్మాణ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, జలవనరులు, పంచాయతీ రాజ్ ఏఈ, పౌర సరఫరాల శాఖ, ఉపాధి హామీ, పేదరిక నిర్మూలన, ఆర్అండ్ బీ, ఐసీడీఎస్, ఉద్యానవన శాఖ, అటవీశాఖ వంటి 20 శాఖలకు గానూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పట్టుమని పది మంది కూడా హాజరు కాకపోవడం బాధాకరం. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ నైనా అధికారులందరూ ఒకేచోట ఉంటే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని వచ్చిన ఆ నలుగురు లో డిప్యూటిక్ తహసిల్దార్. ఐసిడిఎస్ సూపర్వైజర్. హౌసింగ్ ఏఈ. వెలుగు ఏపిఎం తప్ప ఏ అధికారి పాల్గొనకపోవడం విశేషం ప్రజా సమస్యలు గాలికే నా అటు ప్రజలు చర్చించుకుంటున్నారు.



యాడికిలో నిర్వహించిన ప్రజా సమస్య పరిష్కార వేదికలో పాల్గొన్న అధికారులు

# వేసవిలో పిన్నేపల్లిలో తాగునీటి కష్టాలు తప్పవా..

**ఎస్సీ కాలనీ వాసుల ఆవేదన..**

**యాడికి (తెలుగోడు), మార్చి 2 :**

యాడికి మండలం పిన్నేపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ వేసవికాలం వచ్చిందంటే తాగునీటి కష్టాలు తప్పవా అంటూ కాలనీవాసులు వాపోతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కాలనీలో నీటి కొరత ఉందని అనేకసార్లు స్పందన కార్యక్రమాల్లో, ఎంపీడీవో కార్యాలయంలోనూ వినతిపత్రం ఇచ్చినా సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోలేదని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం నాయకుడు దేవరాజ్ వాపోయారు. కొన్ని నెలల కిందట గండికోట పైప్ లైన్ ని పిన్నేపల్లి కి ఏర్పాటు చేయడం జరిగింది కానీ ఎలాంటి మార్పు లేదన్నారు. గండికోట లైన్ వేశారు కానీ రోజుకు ఒక గంట కూడా నీటిని వదలడం లేదన్నారు. ప్రతి సంవత్సరం వేసవి కాలం మొదలుకాగానే పిన్నేపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులు నీటి కోసం పడిగాపులు కాయాల్సి వస్తోందని అన్నారు. ప్రభుత్వ అధికారులు , గ్రామస్థాయిలో పరిశీలించి వాటి సమస్యలను వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.



ఎస్సీ కాలనీలో ప్రజల నీటి కష్టాలు



ఎస్సీ కాలనీలో నీళ్లు తెచ్చుకుంటున్న దృశ్యం

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**మహిళా పోలీసులు, విద్యార్థులతో సైకిల్ ర్యాలీ.. ఏఎస్ఐ విజయ్ గౌరీ..**

**యాడికి (తెలుగోడు), మార్చి 2 :**

అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఏఎస్ఐ విజయ్ గౌరీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలతో సైకిల్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు, మహిళా పోలీస్ విభాగం ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మహిళల భద్రత, గౌరవం, సాధికారతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్సై విజయ్ గౌరీ పాఠశాల రథాల ఉపాధ్యాయులు సీతారామాంజనేయులు విద్యార్థినిలతో ర్యాలీ ప్రారంభమైంది ఈ ర్యాలీ జిల్లా పరిషత్ పాఠశాల వద్ద నుండి కోన రోడ్డు అంబేద్కర్ కాలనీ. పూర్వ వీధుల గూడా తిరిగి పాఠశాల వరకు సాగింది. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఏఎస్ఐ విజయ్ గౌరీ. రథాల ఉపాధ్యాయులు సీతారామాంజనేయులు మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలను అరికట్టడంలో పోలీస్ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. “మహిళలు భయపడకుండా ముందుకు రావాలి. సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలి. మహిళా హెల్ప్ లైన్, శక్తి టీమ్స్ వంటి సేవలను వినియోగించుకోవాలి” అని సూచించారు. సమాజంలో మహిళలకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, కుటుంబ స్థాయి నుంచే బాలికలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలన్నారు. యువతలో లింగ సమానత్వం పై చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

మహిళా పోలీస్ సిబ్బందితో పాటు శక్తి టీమ్స్ ర్యాలీలో పాల్గొని మహిళా రక్షణ, చట్టపరమైన అవగాహన, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాల పై ప్రజలకు సందేశం అందించారు. ఈకార్యక్రమంలో పలువురు విద్యార్థులు మహిళా హక్కులు, బాలికల విద్య, వేధింపుల నిరోధం వంటి అంశాలపై ప్రదర్శించారు. “మహిళను గౌరవించడం అంటే సమాజాన్ని గౌరవించడం” అనే నినాదాలతో గ్రామంలో చైతన్య వాతావరణం నెలకొల్పారు.



ఏఎస్ఐ విజయ గౌరీ ఆధ్వర్యంలో విద్యార్థినులతో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# నేడురథోత్సవం సందర్భంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం

**విద్యుత్ శాఖ ఏఈ విజయ్..**

**యాడికి (తెలుగోడు), మార్చి 2 :**

యాడికి మండల కేంద్రంలో శ్రీ శివలక్ష్మి చెన్న కేశవ స్వామి రథోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారి విజయ్ తెలిపారు. వినియోగదారులు దీన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలన్నారు.



రైతులకు యూరియా అందిస్తున్న వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి

# మోతాదు మేరకే యూరియా వాడాలి

**వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి ..**

**ముద్దనూరు (తెలుగోడు), మార్చి 2 :**

అధికారుల సమాచారంతోనే పంట మోతాదుకు తగ్గట్లు యూరియా వాడాలని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు మండల పరిధిలో రామవరం రైతు సేవా కేంద్రంలో సోమవారం వ్యవసాయ అధికారి రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రానికి 9.9 మెట్రిక్ టన్నులు (220 బస్తాలు)వచ్చింది అన్నారు.గ్రామంలో పంటలు సాగు చేసి అవసరం ఉన్న రైతులకు ఒక్కొక్కరికి రెండు బస్తాలు చొప్పున డిబిటి పద్దతిలో పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అవసరం ఉన్న రైతులు తీసుకుని సద్వినియోగం చేసుకోవాలి అన్నారు.అనవసరంగా వాడితే చీడ పీడల ఉధృతి అధికం అవుతుంది అన్నారు.అవసరం మేరకే వాడుకుంటే ఉపయోగం ఉంటుంది అన్నారు.అవసరం ఉన్న ప్రతి రైతుకు యూరియా అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు సుధాకర్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.



స్త్రీ శక్తి పురస్కారం అందుకుంటున్న శైలజ శ్రీనివాస్

# శైలజ శ్రీనివాస్‌కు స్త్రీ శక్తి పురస్కారం

**విజయవాడ, (తెలుగోడు), మార్చి 2 :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా విశ్వ సాహితీ కళావేదిక సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ బందరు రోడ్డులోని బాలోత్సవ్ భవన్ లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగాసాహితీ వేత్త శైలజ శ్రీనివాస్ కు స్త్రీ శక్తి 2026 పురస్కారాన్ని వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీమతి కొల్లి రమావతి, కలెక్టర్ ఇంతియాజ్,గజల్ శ్రీనివాస్, జి .వి పూర్ణచశీద్ చేతుల మీదుగా మెమంటో, మెడల్, ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంగా సత్కరించారు.

# భక్తి శ్రద్ధలతో శ్రీశైల గిరిప్రదక్షిణ

**శ్రీశైలం (తెలుగోడు), మార్చి 2 :**

శ్రీశైలం మహా క్షేత్రంలో సోమవారం సాయంత్రానికి పౌర్ణమి ఘడియలు రావడంతో దేవస్థానం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు . శ్రీస్వామిఅమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం ఈ గిరిప్రదక్షిణఆలయ మహాద్వారం నుండి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధరమండపం, అంకాళమ్మ ఆలయం, నందిమండపం, బయలువీరభద్రస్వామి ఆలయం నుండి అలంకారేశ్వర ఆలయం మీదుగా వలయ రహదారిపైకి చేరుకుంది. అక్కడి నుండి సారంగధర మఠం మీదుగా సాగి హేమారెడ్డి మల్లమ్మ మందిరం వద్దకు చేరుకుంది. హేమారెడ్డి మల్లమ్మ మందిరం నుంచి మహిషాసురమర్ధిని, రుద్రాక్షమఠం, విభూతిమఠాల మీదుగా రుద్రవనంలోకి చేరుకుంది. రుద్రవనం నుంచి నందిమండపం వద్దకు రావడంతో గిరి ప్రదక్షిణ ముగిసింది. శ్రీశైలక్షేత్రములోని ప్రాచీనమఠాలను, ఆలయాలను భక్తులచేత దర్శింపజేయిస్తూ వారిలో భక్తిభావాలను మరింతగా పెంపొందింపజేయాలని, అదేవిధంగా క్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఈ గిరిప్రదక్షిణను నిర్వహిస్తున్నారు. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులందరికీ ప్రదక్షిణానంతరం శ్రీస్వామివార్లదర్శనం కల్పించారు. ఈ విశేష కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చక వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కార్పోరేటర్ అలిషేర్ ఇషాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న అనంత వెంకటరామిరెడ్డి,అనంత చంద్రారెడ్డి



అదృశ్యమైన కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకొంటున్న సీఐ రాజ్‌కుమార్

## మహిళలు, పిల్లల ఆదృశ్యంపై ఆరా

### సీఐ రాజ్ కుమార్ ..

**రొళ్ల (తెలుగోడు), మార్చి 2 :**
మహిళలు, పిల్లల ఆదృశ్యంపై మండలంలోని హెచ్‌టీ హళ్లి, వద్రహోట్టి గ్రామాల్లో మడకశిర రూరల్ సీఐ రాజ్ కుమార్ ఆరాతీశారు. వేధింపులు తాళలేక సుబ్బమ్మ, ఆమె కూతురు లక్ష్మీతో పాటు ఇద్దరు ఆడిపిల్లతో సహా గత నెల 27న రాత్రి ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. ఏ కారణం చేత అదృశ్యమైయ్యారని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. దీ ంతో అదృశ్యమైన వారి కోసం నలుగురు కానిస్టేబుళ్లు రెండు బృందాలుగా నిమమించి గాలిస్తున్నట్లు సిఐ తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ గౌతమి ఉన్నారు.

## సజావుగా ప్రవేశ పరీక్షలు

**అమరాపురం (తెలుగోడు), మార్చి 2 :**
అమరాపురం మండలంలోని అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల 5వ తరగతి, ఇంటర్, ఐఐటి ప్రవేశ పరీక్షలు సజావుగా జరిగినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. 5వ తరగతికి 173 మంది దరఖాస్తు చేసుకోగా 166 మంది హాజరయ్యారన్నారు. ఇంటర్ ప్రవేశ పరీక్షకు 218 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 208 మంది హాజరైనట్లు తెలిపారు. ఐఐటి ప్రవేశ పరీక్షకు 139 దరఖాస్తు చేసుకోగా అందులో 130 మంది హాజరైనారని ప్రవేశ పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ అపర్ణ, అబ్జర్వర్ కే లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్షలు నిర్వహించారు.



ప్రిన్సిపాల్ అపర్ణ



అబ్జర్వర్ కె. లక్ష్మీనారాయణ



నూతన డైరెక్టర్లను సన్మానించిన దృశ్యం

## వక్కలిగ కులస్తుల డైరెక్టర్ల ఏకగ్రీవ ఎన్నిక

**అగళి (తెలుగోడు), మార్చి 2 :**
మండల వ్యాప్తంగా ఉన్న కుంచిటి వక్కలిగ కులస్తులు సోమవారం మండల కేంద్రంలోని శనిమహాత్మ దేవాలయం కమిటీ భవనంలో సమావేశమై రెండు పంచాయతీలకు ఒక డైరెక్టర్‌ను ఎన్నుకునే విధానంలో అగళి మండలానికి సంబంధించిన ఆరుగురు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇరిగేపల్లికి శ్రీనివాస్, ఉల్లేకెరకి త్యాగరాజు, రామనపల్లికి బసవరాజు, డొక్కలపల్లికి తిప్పేస్వామి, కంబదపల్లికి జయరామప్ప, పి.బ్యాడిగెరకి వన్నేష్ గౌడ్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. ఎన్నికైన డైరెక్టర్లు మడకశిరలో జరిగే అధ్యక్షుడు ఎన్నికలో పాల్గొంటారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి డైరెక్టర్లుగా ఎన్నుకొన్న కుల బంధువులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఒక్కలిగల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.



చేతికి గాయమై తెగిపోయిన వేళ్లు

## పేలుడు పదార్థాల ధాటికి తెగిన చేతివేళ్లు

**గుడిబండ (తెలుగోడు), మార్చి 2 :**
మండల పరిధిలోని ఎస్ ఎస్ గుండ్లు గ్రామంలో పేలుడు పదార్థాలు పేలి బల్లక్క చేతికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్సై రాజకుల్లాయప్ప తెలిపిన వివరాల మేరకు గ్రామ సమీపంలో అడవి పందుల వేటాడే నిమిత్తం కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి పేలుడు పదార్థాలను అమర్చాడు. గ్రామానికి చెందిన బల్లక్క గ్రామ సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి గుడి నీటి కుంట వద్ద గొర్రెలను నీళ్లు తాగించుచుండగా ఆ సమయంలో బల్లక్క కింద కూర్చోవడానికి ప్రయత్నించగా ప్రమాదవశాత్తు అమార్చిన పేలుడు పదార్థాలు పేలి ఆమె ఎడమ చేతికి తీవ్ర గాయమై వేళ్లు తెగిపోయాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను హిందూపురంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె కుమారుడు దేవరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## ఘనంగా శ్రీ కాటికోటేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 2 :**
బత్తలపల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ కాటికోటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవలతో స్వామివారిని మేల్కొలిపి, నిత్యకట్ల కైంకర్య సేవలను వేదపండితులు ధనుంజయ శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కాటికోటేశ్వర స్వామివారిని సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేసి, ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు ఘనంగా చేపట్టారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు భక్తుల సమక్షంలో శాస్త్రోక్తంగా కొనసాగాయి. స్వామివారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. క్షేత్రంలో దుకాణాల ఏర్పాట్ల కోసం స్థలాలు కేటాయించడంతో వ్యాపారులు తమ అంగళ్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎండ వేడిమి నుంచి భక్తులకు ఉపశమనంగా శ్యామియానాలు ఏర్పాటు చేయగా, స్వామివారి ప్రభను ఉంచేందుకు ప్రత్యేక వేదికలను సిద్ధం చేస్తున్నారు. దీంతో బ్రహ్మోత్సవాల సందడి ఆలయ ప్రాంగణమంతా వెల్లివిరిసింది. తదుపరి స్వామివారి మూలవిరాట్కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గ్రామంలోని కాటమయ్య స్వామిని పెళ్లికొడుకుగా అలంకరించి, గ్రామ వీధుల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపును తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో ముష్టూరు నరసింహారెడ్డి, ఓబిరెడ్డి, లింగారెడ్డి, ఆనందరెడ్డి, మల్లికార్జునరెడ్డి, పి. గోవర్ధనరెడ్డి, పి. ఓబిరెడ్డి, శంకరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, నరసింహారెడ్డి, గోవర్ధనరెడ్డితో పాటు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.



పూజలు అందుకుంటున్న శ్రీ కాటికోటేశ్వరుడు



పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు

## నీలకంఠాపురంలో భక్తిశ్రద్ధలతో 'చంద్రమ్మ' ఉత్సవం

### ముగిసిన 'చంద్రమ్మ' వేడుకలు ముగ్గులను తిలకించిన రఘువీరా రెడ్డి దంపతులు..

**అగళి (తెలుగోడు), మార్చి 2 :**
నీలకంఠాపురం గ్రామంలో గత 5 రోజులుగా జరుగుతున్న 'చంద్రమ్మ' వేడుకలు సోమవారం ఘనంగా ముగిశాయి. మాజీ మంత్రి డాక్టర్ ఎన్. రఘువీరా రెడ్డి నివాసం వద్ద గ్రామానికి చెందిన మహిళలు ఈ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గత 5 రోజులుగా ప్రతిరోజూ తెల్లవారుజామునే రఘువీరా రెడ్డి ఇంటి ముందు మహిళలు చంద్రమ్మ ఆకారాన్ని పోలిన పెద్ద పెద్ద ముగ్గులు (ముగ్గులు) వేస్తూ భక్తిని చాటుకున్నారు. చంద్రమ్మను స్తుతిస్తూ జానపద పాటలు పాడుతూ, ఆ ప్రాంతం అంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపారు. సోమవారం ఉత్సవంలో చివరి రోజు కావడంతో, చంద్రమ్మ ఆకారాన్ని రంగురంగుల పూలతో అత్యంత సుందరంగా అలంకరించారు.
గ్రామ సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేసిన చంద్రమ్మ ముగ్గులను రఘువీరారెడ్డి, ధర్మపత్ని సునీతమ్మ తిలకించారు .మహిళల కళా నైపుణ్యాన్ని, భక్తిని ఆమె కొనియాడారు. అనంతరం చంద్రమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరగా కలశంతో ఏర్పాటు చేసిన చంద్రమ్మ విగ్రహాన్ని మహిళలు ఊరేగింపుగా తీసుకెళ్లి, శాస్త్రోక్తంగా నీటిలో నిమజ్జనం చేశారు. ఈ వేడుకలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.



ముగ్గులను తిలకిస్తున్న రఘువీరారెడ్డి దంపతులు

## దొడ్డేరి పాఠశాలను సందర్శించిన ఎంఇఓ శ్రీధర్

**రొళ్ల (తెలుగోడు), మార్చి 2 :**
మండలంలోని దొడ్డేరి మాదిరి పాఠశాల ను సోమవారం మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ సందర్శించారు. జి ఎఫ్ ఎల్ ఎన్ కి సంబంధించిన రికార్డ్స్ జి ఎఫ్ ఎల్ ఎన్ కి సంబంధించిన ఆక్టివిటీస్ , ఎండ్ లైన్ ఎగ్జామ్స్ నిర్వహణ గురించి , స్టూడెంట్ అటెండన్స్ , టీచర్స్ అటెండన్స్ , మిడ్ డే మీల్స్ రికార్డ్స్ , జాదూ పిటార ఉపయోగం గురించి అందులోని ఒక కథ స్వయంగా విద్యార్థుల చే చదివించి వాళ్ళ ద్వారా నే కథ ను చెప్పించారు. ఆదే విధంగా అన్ని స్కూల్స్ లో నూ స్టోరీ కార్డ్ , ఎఫ్ ఎల్ ఎన్ మెటీరియల్ ను సంపూర్ణంగా ఉపయోగించాలని తెలియజేశారు . విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఇఓ శ్రీధర్



విద్యార్థులతో కథ చెప్పిస్తున్న ఎంఇఓ శ్రీధర్. రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఓ శ్రీధర్

## కన్నుల పండువగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవం

**రొళ్ల (తెలుగోడు), మార్చి 2 :**
స్థానిక లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువుగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవలు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలసస్థాపన యోగీశ్వరారాధన ధ్వజరోహణం అనంతరం మహా మంగళారతి నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సామెత లక్ష్మి నరసింహస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యకంగా అలంకరణ చేసి పెళ్లి పిటల మీద కూర్చోబెట్టి సంప్రదాయబద్దంగా వేదపండితుల మంత్రోచారణ తో మంగల్యా ధరణ చేసి కళ్యాణం జరిపించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పురవిధులగుండా ఊరేగించారు. కళ్యాణోత్సవన్నీ తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు.

***నేడు బ్రహ్మరథోత్సవం..***

పది రోజులు పాటు నిర్వహించే లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలో భాగంగా మూడవ రోజైన మంగళవారం బ్రహ్మ రథోత్సవం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా పాల్గుణ మాసంలో పౌర్ణమి రోజున బ్రహ్మ రథోత్సవం నిర్వహిచడం అనాయితీగా వస్తుంది. ప్రతి ఏటా మధ్యాహ్నం ఒంటి (1) గంటకు నిర్వహించే రథోత్సవాన్ని ఈసారి చంద్రగ్రహణం కారణంగా ఉదయం 9:30 గంటలకే బ్రహ్మరథోత్సవం నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కావున భక్తులు ఉదయం 9:30 గంటలకే రథోత్సవం లో పాల్గొనాలని తెలిపారు. తమ మొక్కుబడులు ఈడరెందుకు భక్తులు పెద్ద ఎత్తున పూలమాల తో రథాన్ని ముంచెత్తుతారు. ఈ సందర్భంగా రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు పలువురు దాతలు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు.



వివిధ పూలమాలలతో దేవాలయం ముఖద్వారాన్ని అలంకరించిన దృశ్యం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నరసింహాస్వామి . కళ్యాణోత్సవం జరుపుతున్న వేదపండితులు



మృతుని కుమారుడిరి ఆర్థిక సాయం చేసిన ఉత్సవ సమితి సభ్యులు

## దుర్గామాత ఉత్సవ సమితి సభ్యుల ఉదారత

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 2 :**
బత్తలపల్లికి చెందిన డెకరేషన్స్, సప్లయర్స్ లాల్ భాష అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతి పట్ల బత్తలపల్లి వినాయక ఉత్సవ సమితి సభ్యులు సోమవారం మృతుని కుటుంబ సభ్యులకు రూ.15వేలు ఆర్థిక సాయం అందజేసి ఉదారత చాటుకున్నారు. గత కొంత కాలంగా లాల్బాషా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన ఆదివారం మృతి చెందాడు. బత్తలపల్లిలో శుభకార్యాలకు, ఆశుభకార్యాల యాలకు సప్లయర్స్, ఫ్లవర్ డెకరేషన్ చేస్తూ ప్రజల హృదయాలను గెలుచుకున్నాడు. దీంతో ఆయన మృతి పట్ల ద్రిగ్భాంతిని వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రతి ఏడాది నిర్వహించే దుర్గాష్టమి వేడుకల్లో లాల్బాషా లాభాపేక్ష లేకుండా అత్యంత తక్కువ ఖర్చుతో తన వంతు విశిష్ట సేవలు అందించేవారని ఆయన నిబద్ధతను గుర్తు చేసుకుంటూ ఉత్సవ కమిటి సభ్యులు ఆయన మృతికి చింతిస్తూ, కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మరణం గ్రామానికి తీరని లోటని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## సీనియర్ టిడిపి కార్యకర్త ముద్దరాజు మృతి

### నివాళులు అర్పించిన జడ్పీటీసీ ఉమేష్..

**అగళి (తెలుగోడు), మార్చి 2 :**
మండల కేంద్రమైన అగళి పంచాయతీ సీనియర్ టిడిపి కార్యకర్త వాల్మీకి బోయ ముద్దరాజు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉంటూ సోమవారం మృతి చెందారు. విషయాన్ని తెలుసుకొన్న జడ్పీటీసీ ఉమేష్ మృతుని ఇంటికి వెళ్లి భౌతికయానికి నివాళులు అర్పించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ముద్దరాజు మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఈసందర్భంగా మృతుని కుటుంబాన్ని ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని మేము కూడా అండగా ఉంటామని భరోసా కల్పించి మృతుని కుటుంబీకులకు జడ్పిటిసి ఉమేష్ తన వంతుగా కొంతమేర ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమం లో జడ్పిటిసి ఉమేష్ తో పాటు కరియణ్ణ తదితరులు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన జడ్పిటిసి ఉమేష్

## రెండు ద్విచక్రవాహనాలు ఢీ

### ముగ్గురికి గాయాలు..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 2 :**
మండల పరిధిలోని వేల్పుమడుగు పెళ్లల ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన జయరాములు తన భార్య అనితమ్మతో కలిసి ద్విక్రవాహనంలో హిందూపురం వెలుతున్నాడు. ఇదే సమయంలో మండల కేంద్రమైన నార్పలకు చెందిన నారాయణస్వామి ధర్మవరం నుంచి నార్పలకు ద్విక్రవాహనంలో వెలుతున్నారు. వీరు బత్తలపల్లి మండలం వేల్పుమడుగు క్రాస్ వద్దనున్న పెళ్ల ఫ్యాక్టరీ సమీపంలో ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో వాహనాల్లో వెలుతున్న ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో వారు ఆక్కడికి చేరుకుని క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. బత్తలపల్లి పోలీసులు ఆసుపత్రికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు.



ప్రమాదంలో గాయపడిన జయరాములు, నారాయణస్వామి

## శుభకార్యంలో విషాదం..

### కారు బోల్తా.. బీటెక్ విద్యార్థి మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు ..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 2 :**
స్నేహితుని బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి హాజరై ఆనందంగా వేడుకల్లో పాల్గొన్న యువకుల జీవితాల్లో విషాదం ముసిరింది. నిద్రమత్తులో కారు నడపడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఓ బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి బత్తలపల్లి మండలం పోట్లమర్రి వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కదిరి పట్టణానికి చెందిన సాయితేజ (25), పెనుగొండకు చెందిన వినయ్ కుమార్ రెడ్డి, కడపకు చెందిన యశ్వంత్ రెడ్డి, కళ్యాణదుర్గానికి చెందిన తరుణ్ చౌదరి వీరంతా ఎస్వీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. ధర్మవరంలో జరిగిన తరుణ్ చౌదరి బంధువు వివాహానికి హాజరైన వీరు, పెళ్లి ఊరేగింపు సామాగ్రి కోసం అనంతపురం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. కారు నడుపుతున్న వినయ్ కుమార్ రెడ్డి నిద్రమత్తులోకి జారుకోవడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సాయితేజ తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ప్రమాదానికి గురైన కారు. ప్రమాదంలో మృతి చెందిన సాయి తేజ



తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎంపీడీవో ప్రభావతి దేవికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## వేసవిలో తాగునీటి కష్టాలు తీర్చాలి

**ఎంపీడీవో ప్రభావతి దేవికి ఏఐవైఎఫ్ వినతి..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 2 :**
పెద్దకడబూరు మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం పెద్దకడబూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రభావతి దేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్ పటేల్, మండల సమితి నాయకులు ఉసేన్ బాషా, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతూ వేసవి ప్రారంభం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో నీటి కొరత మరింత తీవ్రంగా మారిందన్నారు. పలు గ్రామాల్లో బోర్లు ఎండిపోవడం, పైప్‌లైన్‌ల ద్వారా సరఫరా అయ్యే నీరు సక్రమంగా అందకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. తాగునీరు ప్రతి పౌరునికి మౌలిక హక్కు అని గుర్తుచేశారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట్ల ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేపట్టాలని, చెడిపోయిన బోర్లు మరమ్మతు చేయడంతో పాటు కొత్త బోర్లు వేయించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో నిల్వ ట్యాంకుల శుభ్రత, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు వంటి అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని తక్షణ చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ప్రభావతి దేవి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పెద్దకడబూరులో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

## గ్రామస్థాయిలో జనసేన పార్టీని బలోపేతం చేస్తాం


**జనసేన నేత హనుమేష్ ..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 2 :**
గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడం లక్ష్యంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టినట్లు పెద్దకడబూరు సొసైటీ డైరెక్టర్, జనసేన పార్టీ మండల నాయకులు హనుమేష్ తెలిపారు. సోమవారం పెద్దకడబూరులో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ ఆవిర్భావ లక్ష్యాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై జనసేన కట్టుబాటును ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదు చేపడుతున్నామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రానికి, గ్రామాలకు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని, సభ్యత్వం పొందిన వారు పార్టీ సైనికుల్లా ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. గ్రామ సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాల కోసం కృషి చేయడమే జనసేన పార్టీ లక్ష్యమని హనుమేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంజమ్మ దేవి దేవాలయానికి రూ. 15 వేల విరాళం

**వైకాపా నేత దేశాయ్ ప్రహల్లాద ఆచారి ..**

**కౌతాళం (తెలుగోడు), మార్చి 2 :**
కౌతాళం మండలం కేంద్రంలోని శివప్ప నగర్‌లో నూతనంగా నిర్మించిన ఎరుకల కులదైవం అంజమ్మ దేవి దేవాలయానికి కౌతాళం మండలం అధ్యక్షులు దేశాయ్ ప్రహల్లాద ఆచారి 15 వేల రూపాయలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో కౌతాళం సర్పంచ్ పాల్ దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, ఉపసర్పంచ్ సక్రి తిక్కయ్య, హైస్కూల్ మాజీ చైర్మన్ వడ్డే రామ, మండల నాయకులకు పూజారి లింగన్న, పాల్ రెడ్డి, వార్డ్ మెంబర్ వడ్డే హుసేని రామకృష్ణ, బస్తీ నాగరాజ్, బస్తీ మర్రిస్వామి, సోషల్ మీడియా లింగన్న, ఎన్టీఆర్ నగర్ బాష, ఖలీల్, ఎరుకుల సంఘం పెద్దలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన అంజమ్మ దేవాలయం



అంజమ్మ దేవాలయానికి రూ. 15 వేల విరాళం అందిస్తున్న కౌతాళం మండలం అధ్యక్షులు దేశాయ్ ప్రహల్లాద ఆచారి

## రైతులకు పాసుపుస్తకాలు పంపిణీ

**రామకుప్పం (తెలుగోడు), మార్చి 2 :**
రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతులకు పట్టాదారుపాస పుస్తకాన్ని టిడిపి మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి పంపిణీ చేశారు. సోమవారం పంచాయతీలోని తిమ్మసముద్రం కాలనీలో ప్రభుత్వం రాజముద్రతో ముద్రించిన వాసపుస్తకాన్ని రైతులకు అందజేశారు. గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రతి ఒక్క రైతుకి రాజముద్రతో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి, వీఆర్వో సులేమాన్, రైతుల పాల్గొన్నారు.



పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్న నేతలు

# చంద్రబాబుతోనే గ్రామ సుపరిపాలన సాధ్యం

### జాలవాడిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ ..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 2 :**
ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే గ్రామ సుపరిపాలన సాధ్యమని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ ముక్కన్న స్పష్టం చేశారు. సోమవారం పెద్దకడబూరు మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అలాగే మేకడోణ గ్రామంలో టీడీపీ నాయకులు హజరత్ వలి, ఉలిగయ్య, రాఘవరెడ్డి సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో గ్రామాభివృద్ధి పట్ల సరైన దృష్టి పెట్టలేదని విమర్శించారు. అనేక గ్రామాల్లో రహదారులు, కాల్వలు, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతులు నిర్లక్ష్యానికి గురయ్యాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం పెరిగిందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా గ్రామాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని వివరించారు. గ్రామాల సమగ్రాభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగే పరిపాలన లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దకడూబూరు సొసైటీ ఛైర్మన్ మీ సేవ ఆంజనేయులు, టీడీపీ నాయకులు మునిస్వామి, శ్రీనివాసులు, రాముడు, వీరేష్, తాయన్న, రామకృష్ణ, భీమన్న, రంగన్న తదితరులు పాల్గొన్నారు.



మేకడోణలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న టీడీపీ నేతలు





జాలవాడిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం . సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

# అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

### కలుగొట్ల వెంకటేష్ కుటుంబానికి వైసీపీ నేతల భరోసా ..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 2 :**
అధైర్య పడొద్దు అండగా ఉంటామని మృతుని కుటుంబానికి వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామంలో వార్డు సభ్యులు గోవిందమ్మ భర్త కలుగొట్ల వెంకటేష్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు జాము మూకన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మట్టి ఖర్చుల నిమిత్తం రామ్మోహన్ రెడ్డి రూ. 5 వేలు, జాము మూకన్న రూ. 10 వేలు చొప్పున మొత్తం 15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గౌల్ల మాధవరెడ్డి, జాము అంజినయ్య, జాము కామయ్య తదితరులు పాల్గొన్నారు.



కలుగొట్ల వెంకటేష్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెపుతున్న వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి



వైసీపీ నేత జాము మూకయ్య తరపున రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**టీడీపీ నేతలు పరామర్శ..**
చిన్నకడబూరు గ్రామంలో మృతి చెందిన కలుగొట్ల వెంకటేష్ మృతదేహానికి టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ గోనుమాను నరసన్న, టీడీపీ నేత బుసిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఇందులో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.





కలుగొట్ల వెంకటేష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు నరవ రమాకాంతరెడ్డి, గోనుమాను నరసన్న

## స్థలం ఆక్రమణ పై ఫిర్యాదు

**ప్రజా సంఘాల నేతలు..**

**రామకుప్పం (తెలుగోడు), మార్చి 2 :**
మండల శివార్లలోని ఎస్టీ హాస్టల్ సమీపంలో అంబేద్కర్ భవనానికి ఇచ్చిన స్థలంలో కొంతమంది చదును చేసి ఆక్రమించుకుంటున్నారని ప్రజా సంఘాలు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కుప్పం ఆర్డీవో విజయలక్ష్మి, మండల తహసిల్దార్ కౌలేష్ కు వినతి పత్రం అందజేశారు. బందార్లపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 577/7 ఆక్రమణ గురైందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అంబేద్కర్ భవనానికి ఎంపీ నిధుల కూడా మంజూరు అయిందన్నారు. అధికారులు స్థల ఆక్రమణ చేసిన వారిపై చర్యలు తీసుకొని అంబేద్కర్ భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. అదేవిధంగా మాదిగల స్మశాన వాటికకు చెందిన భూమి, జగనన్న కాలనీలో ప్రభుత్వ భూములను విక్రయించారని అనర్హులకు పట్టాలిచ్చారని దీనిపై విచారణ జరిపి అక్రమార్కులను శిక్షించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు ,ప్రజా సంఘాలు పాల్గొన్నారు.



తహసీల్దార్ వినతిపత్రం అందిస్తున్న దృశ్యం



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్ష నేతలు

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**రామకుప్పం (తెలుగోడు), మార్చి 2 :**
రామకుప్పం మండల పరిధిలోని చిక్కపల్లి తండా గ్రామంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి చిక్కపల్లి తండాకు చెందిన శ్యామరాజ నాయక్ (45) గత బుధవారం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. భార్య బందువుల ఇంటికి వెళ్లి సోమవారం చిక్క పల్లి గ్రామానికి చెరుకుంది. భర్త ఉరి వేసుకుని ఉండడాన్ని గమనించి స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పంచనామా నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి
కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న శ్యామరాజు

## ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

**బీటీఏ, ఏపీజేఏసీ నేతలు..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 2 :**
రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో స్పష్టమైన చర్యలు తీసుకోలేదని బీటీఏ జిల్లా అధ్యక్షులు, ఏపీజేఏసీ కర్నూలు జిల్లా జాయింట్ సెక్రటరీ జి. భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. ఇప్పటివరకు ఒకే ఒక్క డీఏ ప్రకటించడం తప్ప పెండింగ్ డీఏల చెల్లింపుపై ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. వెంటనే పెండింగ్ డీఏలు విడుదల చేసి, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులపై అనవసర ఒత్తిడులు లేకుండా సానుకూల వాతావరణం కల్పించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగితే బీటీఏ, ఏపీజేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టి ‘ఛలో అమరావతి’ కార్యక్రమానికి పిలుపునిస్తూ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై సమగ్రంగా దృష్టి సారించాలని జి. భాస్కర్ హితవు పలికారు.



బీటీఏ జిల్లా అధ్యక్షులు భాస్కర్





వాహనదారులకు హెల్మెట్లపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## హెల్మెట్లపై అవగాహన

**రామకుప్పం (తెలుగోడు), మార్చి 2 :**
ద్విచక్ర వాహనాలు భద్రత, హెల్మెట్‌ధారణపై అక్షర స్కూల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలో విద్యార్థిని, విద్యార్థులు హెల్మెట్లపై ర్యాలీ చేపట్టారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించి వాహన వాహనాలు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ఐ రెడ్డి శేఖర్, అక్షర స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



వికలాంగులకు నూతన పెన్షన్లు అందిస్తున్న కూటమి నేతలు

## వికలాంగులకు నూతన పెన్షన్ పంపిణీ

**రామకుప్పం (తెలుగోడు), మార్చి 2 :**
మండల పరిధిలోని కెంచన బల్ల, ఉన్సిగానిపల్లి పంచాయతీ పరిధిలోని వికలాంగులు, వితంతువులకు నూతన పెన్షన్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. కెంచన బల్ల లో 21 మందికి, ఉన్సిగానిపల్లిలో 18 మందికి రెండు నెలల పెన్షన్ను 12 వేల రూపాయలను లబ్ధిదారులకు అందజేశారు. గత 7 సంవత్సరాలు నుంచి వికలాంగులకు పెన్షన్ అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో పెన్షన్ మంజూరుతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేత నారాయణ చారి, ఎంపీపీ సులోచన గుర్రప్ప, వైస్ ఎంపీపీ వెంకట్రామ గౌడు, మాజీ సర్పంచ్లు రామ్మూర్తి, జయశంకర్, యూనిట్ ఇన్చార్జ్ చంద్రశేఖర్ రెడ్డి, కోక్లస్టర్ ఇంచార్జ్ శంకరాచలం, నేతలు నాగభూషణం, సత్తి, మహేంద్ర నాయుడు, సుభాష్, మనేష్, గుణశేఖర్, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.




వికలాంగులకు నూతన పెన్షన్లు అందిస్తున్న కూటమి నేతలు

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 2 :**
ధర్మవరం 132 కేవీ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మత్తులు చేపట్టనున్న నేపథ్యంలో నేడు బత్తలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బత్తలపల్లి విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ శివయ్య ఒక ప్రకటనలో తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం, బత్తలపల్లి, లింగారెడ్డిపల్లి, చెర్లోపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు వ్యవసాయ బావులకు అందించే విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని అసిస్టెంట్ ఇంజనీర్ కోరారు.

# సాంతూరు తుమ్మెన్‌పేట్‌లో విరోష్ దంపుతులు




వివాహానంతరం టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ-రష్మిక స్వగ్రామానికి రావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మెన్‌పేట గ్రామం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. నూతన దంపతుల రాకతో గ్రామంలో ఉత్సాహం వెల్లివిరిసింది. పెళ్లి తర్వాతి సంప్రదాయ ఆచారాల్లో భాగంగా ఈ జంట డప్పు, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా గ్రామంలోకి ప్రవేశించారు. అనంతరం తులసిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సత్యనారాయణ స్వామి వ్రతంలో ఆసీనులై, కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 400 మందికి పైగా ఆహ్వానితులు హాజరైనట్లు సమాచారం. విజయ్-రష్మికలను ఒక్కసారి చూడాలనే ఆశతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా చేరుకున్నారు. తమ అభిమాన నటులు సొంత ఊరిలో ఇంత సాదాసీదాగా, సంప్రదాయ బద్ధంగా వేడుకలు జరుపుకోవడం చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని వీధులన్నీ జనంతో కళకళలాడాయి. స్టార్ కపుల్ రాక నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. వారి నివాసం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. ముందస్తు పాసులు ఉన్న వారినే లోపలికి అనుమతించారు. అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ నేతృత్వంలో సీఐ నాగరాజు, బల్మూరు ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. టాలీవుడ్‌లో సెన్సేషన్‌గా నిలిచిన ఈ జంట తమ స్వగ్రామంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోలు, ఫోటోలు అభిమానుల్లో విపరీతంగా షేర్ అవుతూ ట్రెండ్ అవుతున్నాయి.

# ఉస్తాద్ నుంచి పవన్ మరో లుక్


పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ ఉస్తాద్ భగత్ సింగ్ హరీష్ శంకర్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్నది. ఈ మూవీలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నా కీలక పాత్రలో నటిస్తోంది. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన దేఖ్ లేంగే సాలా, సాంగ్స్ నెట్టింట వైరల్ అవుతున్నారు. మేకర్స్ ఏదో ఒక ప్రమోషనల్ మెటీరియల్ రిలీజ్ చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. తాజాగా రిలీజ్ చేసిన లుక్‌లో ఉస్తాద్ భగత్ సింగ్‌గా పవన్ కల్యాణ్ తన దైన స్టైల్‌లో చైర్‌పై కూర్చొని ఛిల్ అవుట్ మూడ్‌లో ఉండటం చూడొచ్చు. ఈ స్టిల్ చూస్తుంటే అభిమానులు ఆశించే ఎంటర్‌టైన్‌మెంట్ ఉస్తాద్ భగత్ సింగ్‌లో పుష్కలంగా ఉండబోతున్నట్టు హరీష్ శంకర్ హింట్ ఇచ్చేస్తున్నాడు. తాజా లుక్ అభిమానులు, మూవీ లవర్స్‌లో మరింత హైప్ పెంచేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేసిన ఉస్తాద్ భగత్ సింగ్ గ్లింప్స్‌లో భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది..



# టాక్సిస్‌లో తబాహి సాంగ్ విడుదల



కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం యష్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవనుందనే విశ్వాసం అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై హైప్‌ను అమాంతం పెంచేసింది. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'తబాహి'ను మేకర్స్ విడుదల చేశారు. అయితే కేవలం ఆడియో రూపంలో మాత్రమే సాంగ్ విడుదల కావడంతో ఫ్యాన్స్ కొంత నిరాశ వ్యక్తం చేస్తున్నారు. విజువల్ ప్రెజెంటేషన్ కోసం ఎదురు చూసిన అభిమానులకు లిరికల్ లేదా వీడియో సాంగ్ రాకపోవడం చిన్న నిరుత్సాహమే అయినప్పటికీ, పాట మాత్రం మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ఈ సాంగ్‌ను పాన్ ఇండియా స్థాయిలో అన్ని ప్రధాన భాషల్లో విడుదల చేశారు. తెలుగులో ఈ పాటకు ప్రముఖ లిరిసిస్ట్ రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, సంగీత దర్శకుడు విశాల్ మిశ్రా స్వరపరచి స్వయంగా ఆలపించారు. మ్యూజిక్‌లో యాక్షన్ మూడ్, ఎమోషనల్ అండర్‌టోన్ కలగలిపిన శైలి కనిపిస్తోందని సంగీత ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. 'టాక్సిక్'లో యష్‌కు జోడీగా కియారా అద్వాని నటిస్తుండగా, కీలక పాత్రల్లో నయనతార, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్, టోవినో థామస్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ తారాగణం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి 'తబాహి' సాంగ్‌తో 'టాక్సిక్' మ్యూజికల్ జర్నీ ప్రారంభమైంది. త్వరలో విజువల్ సాంగ్ విడుదలైతే అంచనాలు మరింత పెరగడం ఖాయం.





# పెద్ది రెండో సింగిల్ విడుదలకు సిద్ధం

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' రెండో సింగిల్ 'రాయ్ రాయ్ రా రా' విడుదలపై ఎట్టకేలకు క్లారిటీ వచ్చింది. తొలి పాట 'చికిరి చికిరి'కి మంచి స్పందన లభించిన నేపథ్యంలో రెండో సాంగ్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈసారి ఎలాంటి ప్రోమో విడుదల చేయకపోవడంతో పాట రిలీజ్ టైమ్‌పై కొంత గందరగోళం నెలకొంది. తాజా అప్‌డేట్ ప్రకారం 'రాయ్ రాయ్ రా రా' పాటను మంగళవారం సాయంత్రం 7:02 గంటలకు విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. రిలీజ్ టైమ్‌ను కన్ఫర్మ్ చేస్తూ చరణ్‌కి సంబంధించిన పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఆ పోస్టర్‌లో చరణ్ మాస్ అవతార్‌లో కనిపిస్తూ ఫ్యాన్స్‌ను ఉత్సాహపరుస్తున్నారు.
ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ఈ పాట మోటివేషనల్ టచ్‌తో కూడిన మాస్ నంబర్‌గా ఉండనుంది. ముఖ్యంగా చరణ్ డాన్స్ మూవ్స్ ఈ సాంగ్‌కు హైలైట్ అవుతాయని టాక్. తన ఎనర్జీ, గ్రేస్‌తో చరణ్ మరోసారి అభిమానులను అలరించనున్నాడని తెలుస్తోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో ఈ సాంగ్‌పై భారీ చర్చ నడుస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది.

# ఉగాదికి విశ్వంభర స్పెషల్ గ్లింప్స్

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'విశ్వంభర'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు వశిష్ట ఈ సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తుండగా,యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఈ చిత్రంలో త్రిష, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. సంగీతాన్ని ఎంఎం కీరవాణి అందిస్తుండగా, ఛాయాగ్రహణ బాధ్యతలు చోటా కే నాయుడు నిర్వహిస్తున్నారు. విజువల్‌గా తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం అత్యాధునిక సాంకేతికతతో రూపొందుతోంది. షూటింగ్ పూర్తయినప్పటికీ 'విశ్వంభర' విడుదల కొంతకాలంగా వాయిదా పడుతోంది. ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ పనులేనని తెలుస్తోంది. అత్యున్నత స్థాయి సీజీ వర్క్ అవసరం కావడంతో ఎక్కడా రాజీ పడకుండా మేకర్స్ సమయం తీసుకుంటున్నారు. టీజర్‌లోని కొన్ని గ్రాఫిక్స్‌పై సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలను సీరియస్‌గా తీసుకుని రీ-వర్క్ కూడా చేపట్టినట్లు సమాచారం. ఈ చిత్రంలో వీఎఫ్‌ఎక్స్‌కే దాదాపు రూ.75 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారనే వార్తలు ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఉగాది సందర్భంగా 'విశ్వంభర' స్పెషల్ గ్లింప్స్ విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే గ్లింప్స్‌తో పాటు అధికారిక రిలీజ్ డేట్ ప్రకటించే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే టీజర్‌తో మంచి క్రేజ్ తెచ్చుకున్న ఈ చిత్రం, కొత్త గ్లింప్స్‌తో అంచనాలను మరింత పెంచే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కథ విషయానికి వస్తే, 'విశ్వంభర' 14 లోకాల కాన్సెప్ట్ చుట్టూ తిరిగే ఫాంటసీ అడ్వెంచర్‌గా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. పౌరాణికంగా చెప్పబడే ఊర్ధ్వ లోకాలు, అధో లోకాల నేపథ్యంతో కథ సాగుతుందని, వీటికి మించి ఉన్న 'విశ్వంభర' అనే ప్రత్యేక లోకాన్ని చేరుకోవడానికి హీరో చేసే సాహస యాత్ర ప్రధాన కథాంశమని ప్రచారం. ఈ స్టోరీ లైన్ మెగా అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల జరిగిన ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ థియేట్రికల్ ట్రైలర్ ఇప్పటికే సిద్ధంగా ఉందని తెలిపారు. టీజర్‌లో చూసిన విజువల్స్‌తో పోలిస్తే ట్రైలర్ పూర్తిగా భిన్నంగా, మైండ్ బ్లోయింగ్ అనుభూతిని ఇస్తుందని ఆయన వ్యాఖ్యానించడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. టీజర్‌పై వచ్చిన విమర్శలకు ట్రైలర్‌తో గట్టి సమాధానం ఇవ్వాలన్నదే యూనిట్ లక్ష్యమని తెలుస్తోంది.




Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD .. PRGI No- APTEL/25/A2739, Cell- 9963496956, 7382712780.